క్లుప్తంగా

వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: స్వాతంత్య్ర సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీ, కొత్తవలస గ్రామంలో మంగళవారం జరిగింది. యస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కడ్రక కమలమ్మ, ఉపాధ్యాయుడు చిన్నారావు, సొసైటీ కార్యదర్శి షేక్ గౌసలు అల్లూరి చిత్రపటం వద్ద పూలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, అందులో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు.

సబ్‌కలెక్టర్ పరిశీలన



గుమ్మలక్ష్మీపురం సచివాలయ బ్లూప్రింట్ పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట, గుమ్మలక్ష్మీపురం ప్రాంతాల్లో పాలకొండ సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో నిర్మాణ దశలోని సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. ఏ నిర్మాణం ఎంత మేర పూర్తయింది.. ఇంకా ఏ మేర పనులు చేపట్టాల్సి ఉందనే విషయాలను స్వయంగా పరిశీలించి, నివేదిక తయారు చేసుకున్నారు. ఆయన వెంట తహసీల్దారు ఎన్.శేఖర్ తదితరులు ఉన్నారు.

అవగాహనతో సాధ్యం



సిబ్బందికి సూచనలు చేస్తున్న నోడల్ అధికారి వినోద్‌కుమార్

పాలకొండ రూరల్: సీజన్ వ్యాధుల నియంత్రణ అవగాహనతోనే సాధ్యమని జిల్లా నోడల్ అధికారి వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని అన్నవరం పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామ స్థాయిలో విధులు చేపడుతున్న ఆశా కార్యకర్తలు రోగాలు, వాటి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్యాధికారి వి.కమల్‌నాథ్ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

కొండచిలువ హతం



హతమార్చిన కొండచిలువ

సీతానగరం: మండలంలోని కృష్ణారాయపురంలో రైతులు పొలం పనుల్లో నిమగ్నమైన సమయంలో మడిగట్టు నుంచి 6.6 అడుగుల కొండచిలువ చెరువులో వెళ్తున్నట్లు గుర్తించిన రైతు వెంకటరమణ కర్రతో మోది హతమార్చాడు. మంగళవారం ఉపాధి పనుల కోసం పొలంలో వెళ్తుండగా కొండచిలువ వెంకటరమణ కంటపడింది.

శ్రీరామాలయ ప్రతిష్ఠ ప్రారంభం


బలిజిపేట: మండలంలోని బడేవలసలో శ్రీరామాలయ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. అందులో భాగంగా మంగళవారం యర్ల రాంబాబు శాస్త్రి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ మహాగణపతి పూజ, ప్రతిష్ఠా సంకల్పం, పుణ్యావాహచనం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాశన, యాగశాల ప్రవేశం, సంస్కారం, అంకురారోహణ, నవగ్రహ, యోగిని, వాస్తు, క్షేత్ర పాలక సర్వతో భద్ర మంటప, మండల ఆవాహనములు, ఆరాధనలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మినీ గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని మినీ గురుకులం, పాచిపెంట పాఠశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఒకటవ తరగతిలో ప్రవేశానికి, 2 నుంచి 7వ తరగతి వరకు ఉన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకురాలు ఆర్.కృష్ణవేణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మినీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

గర్జిస్తే గండమే.. ఉరిమిందంటే నష్టమే..

- వరుస ప్రమాదాలతో భయపడుతున్న ప్రజలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న అధికారులు



పిడుగు పడే ముందు వచ్చే మెరుపు (ఇన్‌సెట్లో) పిడుగు పాటుకు మృతి చెందిన ఘనసరకు చెందిన అలపర్తి సిమ్మన్న (ఫైల్)

భామిని: కొద్ది రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆకాశం ఉరిమిందంటే మెరుపులు మెరుస్తున్నాయి. పిడుగులు పడి ప్రాణ నష్టం జరుగుతోంది. ఉరుములు, మెరుపుల సమయంలో వస్తున్న గర్జనలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గత నెల 28న భామిని మండలంలో పిడుగు పడి పాలపర్తి సిమ్మన్న(62) మృత్యువాత పడ్డాడు. వీరఘట్టం మండల కేంద్రంలో పిడుగుల ధాటికి రెండు ఆవులు మృత్యువాత పడ్డాయి. ఇటువంటి సంఘటనలు జిల్లాలో ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ గర్జనలతో ఆరంభమైంది. సాయంత్రం అయితే చాలు భయంకరమైన ఉరుములు, మెరుపులతో భయానక వాతావరణం చోటుచేసుకుంటోంది. బయటకు వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. పిడుగులు పడే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాతావరణ శాఖాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. వాతావరణ సమాచారం ఎప్పటికప్పుడు సెల్‌ఫోన్లకు మెసేజ్ రూపంలో పంపిస్తున్నారు. ఎక్కడ పిడుగులు పడే అవకాశం ఉందో.. ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తూ సమాచారం చేరవేస్తున్నారు.

ఇలా చేయాలి..

- ఆకాశంలో ఉరుములు, మెరుపుల చూస్తే 30 నిమిషాలు ఇంట్లోనే ఉండాలి.
- శరీరం జలదరింపుతో మెడ వెనుక భాగంలో వెంట్రుకలు లేచి నిలబడితే మెరుపు లేదా పిడుగు పడే సమయం ఆసన్నమైందని గ్రహించాలి.
- ఆ సమయంలో చెరువులు, సరస్సులు, నీటికుంటల్లో ఉన్నా, సమీపంలో ఉన్నా దూరంగా వచ్చేయాలి.
- విద్యుత్ ప్రసరింపజేసే అన్ని యుటిలిటీ లైన్లు, వస్తువుల నుంచి దూరం కావాలి. ఫోన్, పవర్, మెటల్, కంచెలు, హెడ్‌ఫోన్స్, రైల్వే ట్రాక్‌లు, విండ్ మిల్లులు, చెట్లు, ఎత్తైన కొండశిఖిరాలకు దూరంగా ఉండాలి.



ఇటీవల వీరఘట్టంలో పిడుగుపాటుకు మృతి చెందిన పాడి ఆవులు

ఆరుబయట చేయకూడనవి...

- ప్రతికూల వాతావరణంలో ఆరుబయటకు వెళ్లకూడదు
- ఆరుబయట, అటవీ ప్రాంతంలో ఉన్నట్లయితే చిన్న, మరుగుజ్జు చెట్ల కింద ఆశ్రయం పొందాలి. పెద్ద పెద్ద చెట్ల కింద ఉండరాదు.
- విద్యుత్, టెలిఫోన్ స్తంభాలు, బైక్‌లు, ఎలక్ట్రిక్ వస్తువులు, కంచె తీగలు, యంత్రాలకు దూరంగా ఉండాలి. ఇవి మెరుపులను ఆకర్షిస్తాయి.
- సురక్షిత స్థలాలకు వెళ్లడానికి తగినంత సమయం లేకుంటే నేలపై బంతిలాంటి భంగిమలో చెవులు మూసుకొని తలను నేలకు తగలకుండా మోకాలిపై కూర్చోవాలి. మిమ్మల్ని మీరు చిన్న లక్ష్యంగా చేసుకోవాలి.

ఇంట్లో ఉన్నప్పుడు..

- హెచ్చరికల అప్‌డేట్స్, హెచ్చరిక సూచనల కోసం సమాచారాన్ని తెలుసుకోవాలి.
- తలుపులు, కిటికీలు, వరండాలకు దగ్గరగా ఉండకూడదు. అలాగే విద్యుత వాహకాలకు దూరంగా ఉండాలి.
- మెరుపుల సమయంలో ఇంటిలోని ఎలక్ట్రిక్ పరికరాలను ఉపయోగించకుండా అన్‌ప్లగ్ చేయాలి.
- మెరుపుల సమయంలో స్నానాలు చేయకూడదు. గిన్నెలు కడగరాదు. ప్రవహిస్తున్న నీటితో ఏ పనీ చేయవద్దు.

ప్రథమ చికిత్స తప్పనిసరి..



పిడుగు పాటుకు గురైన వ్యక్తిని తాకవచ్చు. పల్స్ కోసం బాధితుడి దవడ కింద, మెడపై చేయి పెట్టి చూడాలి. శ్వాస గుర్తింపునకు కరోటిడ్ ధమని ఉత్తమమైన ప్రదేశం. బాధితుడు శ్వాస తీసుకోకపోతే వెంటనే నోటితో నోటిలో ఊదాలి. బాధితుడ్ని త్వరగా ఆస్పత్రికి తీసుకువచ్చి ప్రథమ చికిత్స అందించాలి.

– కె. విజయపార్వతి, డిప్యూటీ డీఎంహెచ్ఓ, పాలకొండ

వండువ - నవగాం రోడ్డుకు మోక్షం



వండువ - నవగాం రోడ్డులో జరుగుతున్న పనులు

- రూ. 1.80 కోట్లతో సీఎస్‌పీ రోడ్డు పనులు

సాక్షి ఎఫెక్ట్...

వీరఘట్టం: సంక్రాంతి పండగ లోపు రోడ్లన్నీ బాగుచేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వ హామీని సీఎస్‌పీ రోడ్డు వెక్కిరిస్తోంది. ఈ రోడ్డులో వండువ జంక్షన్ నుంచి నవగాం వరకు గోతులేర్పడడంతో ఎప్పటికప్పుడు ప్రమాదాలు జరుగుతుండేవి. ఈ వ్యవహారంపై ఇటీవల సాక్షిలో ' అధ్వానంగ రోడ్లు – జనం అవస్థలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీంతో రేగులపాడు నుంచి నవగాం వరకు మొత్తం 3.8 కిలోమీటర్ల రోడ్డు వేసేందుకు ప్రభుత్వం రూ. 1.80 కోట్లు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నట్లు ఆర్అండ్‌బీ ఈఈ జగన్నాథ్, ఏఈ కిరణ్‌కుమార్ తెలిపారు.


సాక్షి
అధ్వానంగా రోడ్లు...
జనం అవస్థలు!

సాక్షిలో వచ్చిన కథనం

20 నుంచి సమ్మెబాట..



కమిషనర్‌కు సమ్మె నోటీస్ అందజేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

పాలకొండ రూరల్: ఈ నెల 20 నుంచి సమ్మెబాట పట్టనున్నట్లు పాలకొండ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు నగర కమిషనర్ రత్నంను మంగళవారం కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. కేంద్రం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్స్, కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ దేశ వ్యాప్తంగా కార్మిక లోకం సమ్మెబాట పడుతున్నట్లు తెలిపారు. కార్మికుల సమ్మెకు మద్దతు తెలియజేస్తున్నట్లు సీఐటీయూ నాయకుడు కాద రాము తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక యూనియన్ నాయకులు సీహెచ్ సంజీవి, పి.వేణు, విమల, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పత్రాలు తప్పనిసరి



వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

పాలకొండ రూరల్: వాహన చోదకుల వద్ద వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు ఉండాలని పాలకొండ డీఎస్పీ ఎం. రాంబాబు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో మంగళవారం రాత్రి సీతంపేట రహదారిలో విస్తృత వాహన తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా సీతంపేట – కొత్తూరు వయా భామిని, బలద, హిరమండలం మీదుగా ఒడిశాలో ప్రవేశించే వాహనాలను ప్రత్యేకంగా తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని వారికి అపరాధ రుసుం విధించారు.

రాయితీపై పశుదాణా పంపిణీ

గరుగుబిల్లి: పాడిరైతులకు 50 శాతం రాయితీపై పశుదాణా పంపిణీ చేయడం జరుగుతుందని మండల పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి ఎస్.సురేష్‌కుమార్ ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. పశుగణనలో పశువులు(ఆవులు, గేదెలు) నమోదు చేయబడి, భారత్ పశుధన్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి ఈ సదుపాయం వర్తిస్తుందన్నారు. నెలకు 50 కిలోల దాణా బస్తా అందించడం జరుగుతుందన్నారు. రూ.1110 విలువైన 50 కిలోల దానా బస్తాను సబ్సిడీ పోను రూ.555లకు అందజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారంతా రైతు సేవా కేంద్రాల్లో నగదు చెల్లించి, రసీదు పొందాలన్నారు.

ధైర్యంగా వ్యవహరించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ సిమ్మాలమ్మ

పాలకొండ రూరల్: నేటి సమాజంలో బాలికలు ధైర్యంగా వ్యవహరించాలని సీడీపీఓ. బి.సిమ్మాలమ్మ అన్నారు. కిశోర వికాస కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని బుక్కూరు, బాసూరు, పట్టణ పరిధిలోని కస్పావీధి, పెద్దకాపు వీధి క్లస్టర్లలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు బాలికా విద్యా ప్రాముఖ్యత, సంపూర్ణ ఆరోగ్యం, పౌష్టికాహారం, రుతు పరిశుభ్రత, మానవ అక్రమ రవాణ, బాల్య వివాహ నిషేధిత చట్టం, పీటీసీఎస్‌ఓ చట్టంపై అవగాహన కల్పించారు. ఈమె వెంట సూపర్‌వైజర్లు దశారత్నం, మేరీతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణంపై జాయింట్ సర్వే

సీతంపేట: మండలంలోని దోనుబాయి దుర్గమ్మ గుడి వద్ద స్థానికులు చేపడుతున్న ప్రహరీ నిర్మాణ పనులను అటవీశాఖ అడ్డుకుంది. దీంతో సర్పంచ్ కె.వెంకునాయుడుతో పాటు ప్రజలు ఇటీవల పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు జాయింట్ సర్వే చేపట్టి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో తహసీల్దార్ అప్పలరాజు, ఆర్ఐ గణేష్, సర్వేయర్ శంకరరావు, తదితరులు మంగళవారం సర్వే చేపట్టారు.

నవధాన్యాలతోనే భూసారం

పార్వతీపురం రూరల్: ప్రతి రైతు నవధాన్యాలను ఉపయోగించడం వల్ల వ్యవసాయ భూముల్లో భూసారం పెరుగుతోందని ఏపీ సీఎన్ఎఫ్ అధికారులు, సిబ్బంది పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లిలో రైతులకు నవధాన్యాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి రమణమ్మ మాట్లాడుతూ వ్యవసాయభూముల్లో పంటలు వేసే ముందు ఎకరాకి పది కేజీల నవధాన్యాలను వేయడం వల్ల కార్బన్ శాతంతో భూసారం పెరుగుతోందని, దీనివల్ల రసాయన ఎరువులు అధికంగా ఉపయోగించాల్సిన అవసరం లేదని, వరి పంటతో పాటు అపరాల పంటలకు అధిక దిగుబడి వస్తుందని చెప్పారు. చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతికి చెందిన విత్తనాలతో కలిపివేయడం వల్ల వచ్చే ఉపయోగాలను రైతులకు వివరించారు. నవధాన్యాలతో జీబీఎస్ఎఫ్ చక్రం వేసి రైతులకు వివరించారు. అలాగే విత్తనాలను రైతులకు ఆర్‌బీకేల ద్వారా అందుబాటులో ఉంచనున్నట్లు ఆమె తెలిపారు.

50మందికి ఉచిత వైద్యపరీక్షలు

బలిజిపేట: బలిజిపేటలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 50మందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. బలిజిపేట సత్యసాయి సేవాసమితి కన్వీనర్ వి.సుబ్బారావు ఆధ్వర్యంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించిన ఉచితవైద్య శిబిరానికి 50మంది హాజరవగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన 27మందికి విశాఖలో ఆపరేషన్లు చేయించి తిరిగి బలిజిపేట తీసుకు రానున్నామని క్యాంప్ కోఆర్డినేటర్ వెంకట్ తెలిపారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశామని కన్వీనర్ సుబ్బారావు తెలిపారు.

ఆటపాటలతో కూడిన విద్యనందివ్వాలి



అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు సూచనలిస్తున్న ఆర్‌జేడీ చిన్మయిదేవి

గుమ్మలక్ష్మీపురం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందివ్వాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి సూచించారు. మండల పరిధిలోని భద్రగిరి ఐసీడీఎస్ కార్యాలయం వద్ద పీవోలు, సూపర్‌వైజర్లతో మంగళవారం ఆమె సమావేశమై, పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి కేంద్రంలో ప్రీస్కూల్ నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి నెలనెలా ఇచ్చే పౌష్టికాహారం పక్కాగా అందివ్వాలన్నారు. ఆమె వెంట జిల్లా ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ తదితరులు ఉన్నారు.

కిశోరవికాసంతో బాలికల్లో చైతన్యం

- ఆర్‌జేడీ చిన్మయిదేవి



కిశోరవికాసంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

భామిని: కిశోరవికాసంతో బాలికల్లో చైతన్యం వస్తుందని రాష్ట్ర మహిళా, బాలల సంక్షేమ శాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. జూన్ 10 వరకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో యుక్త వయస్సులోకి రానున్న బాలికలకు కిశోర వికాసంపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.కనకదుర్గ మాట్లాడుతూ.. బాలికలు రుతుక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భామిని, సీతంపేట సీడీపీఓలు శాంతి భవానీ, రంగలక్ష్మి, బీపీఓ వరలక్ష్మి, మహిళా పోలీస్ చందన పట్నాయక్, ఎస్ఓలు, కార్యకర్తలు, బాలికలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి..

సీతంపేట: కౌమర దశ బాలికలు సరైన పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ ఆర్‌జేడీ చిన్మయిదేవి తెలిపారు. మండలంలోని సోమగండి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జూన్ 10వ తేదీ వరకు కౌమరదశ బాలికలు ఎటువంటి ఆహారం తీసుకోవాలి.. ఎలాంటి ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలో వివరించేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని, దీన్ని కిశోరబాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ, సీడీపీఓ రంగలక్ష్మి, సూపర్‌వైజర్ లావణ్య, అంగన్‌వాడీ కార్యకర్త పరిమళ, ఎర్రకువ్వారి, అక్కన్నగూడ, సోమగండికి చెందిన కిశోర బాలికలు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

కొమరాడ: గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) ఎస్.భాస్కరరావు సూచించారు. మండలంలోని కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రికి రికార్డులు పరిశీలించడంతో పాటు వైద్య సిబ్బంది సేవలపై ఆరాతీశారు. ఐదేళ్ల వయసులోపు పిల్లల్లో పెరుగుదల లోపిస్తే జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేయాలన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలకు సకాలంలో వైద్య తనిఖీలు చేసి, మెరుగైన ఆరోగ్యానికి వారికి సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. ప్రజలకు వైద్య సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం ఆశ డే కార్యక్రమ అజెండా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు అభినందన



ఎమ్మెల్యే జగదీశ్వరితో సన్మానం పొందిన విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభినందన సభ మంగళవారం ఏర్పాటు చేసి ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఎంఈవోలు బి.చంద్రశేఖర్, బి.భీముడుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి హాజరై, విద్యార్థులను మెమెంటోలతో సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో ఉన్నత చదువులు కూడా బాగా చదివి జీవితంలో మంచి స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఈవో ఎస్.తిరుపతినాయుడు, ఐటీడీఏ డీఈవో జ్ఞానప్రకాష్, ఏటీడబ్ల్యూవో సురేష్‌కుమార్, ఎంపీడీవో సాల్మన్‌రాజు, తహసీల్దారు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు..



కుశిమి పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి చాందిని మాట్లాడుతూ.. రోగులతో పాటు వచ్చే సహాయకుల సౌకర్యార్థం ఓఆర్ఎస్, మజ్జిగ, మంచినీరు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

– సీతంపేట

నల్లరిబ్బన్లు ధరించి నిరసన



ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లపై ఎంఎల్‌హెచ్‌పీలు చేసిన అనుచిత వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ గరుగుబిల్లి పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) ఎదుట ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు నల్లరిబ్బన్లు ధరించి, మంగళవారం నిరసన చేపట్టారు. ఎంఎల్‌హెచ్‌పీలు తమ హక్కుల సాధన కోసం ఇటీవల చేసిన ధర్నాలో మిగతా క్యాడర్(ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు) మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడారని గుర్తు చేశారు. తక్కువ చదువులు చదివిన ఏఎన్ఎంలకు రూ.50 వేలు, సూపర్‌వైజర్లకు రూ.70 వేలు ఇస్తున్నారని, ఉన్నత చదువులు చదివిన వారికి తక్కువ వేతనాలు ఇస్తున్నట్లు అనడం ఆ వర్గపు ఉద్యోగులను అవమానించడం కాదా అని ప్రశ్నించారు. విధుల నిర్వహణలో కూడా ఏఎన్ఎంల యాప్‌లు కూడా వారే చూస్తున్నట్లు చెప్పడం సమంజసం కాదన్నారు. మరోసారి ఇలాంటి అవమానకర వ్యాఖ్యలు చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బి.చిన్నమ్మి, సీహెచ్ ఉదయకుమారి, ఎస్.దుర్గాప్రసాద్, రమణ తదితరులు పాల్గొన్నారు.

– గరుగుబిల్లి